సాక్షి
మహబూబాబాద్
బుధవారం | 16 | అక్టోబర్ | 2024



రామప్ప ఖ్యాతి ప్రపంచానికి చాటాలి

రామప్ప ఆలయ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలని ములుగు కలెక్టర్ దివాకర పిలుపునిచ్చారు.

- 10లో ▸



వరంగల్ మార్కెట్‌లో అంతర్గత బదిలీలు

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలో విధులు నిర్వర్తించే ఉద్యోగులను బదిలీ చేస్తూ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి నిర్మల ఉత్తర్వులు జారీ చేశారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
36.7^{0} /22.6^{0}

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఆకస్మిక దాడులు



బయ్యారం: మండలంలోని గంధంపల్లి–కొత్తపేటలోని పలు పురుగు మందుల షాపులపై మంగళవారం వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆకస్మికదాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా షాపుల్లో అమ్మకాలకు సిద్ధంగా ఉంచిన పురుగు మందులతో పాటు రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ దాడుల్లో రిజిస్టర్లు సక్రమంగా నమోదు చేయని డీలర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఓ రాంజీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను పరిరక్షించుకోవాలి

నెల్లికుదురు: పాఠశాలలను పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని ఎంఈఓ రాందాస్ అన్నారు. ఈ నెల 13న 'మందుబాబులకు అడ్డాగా పాఠశాల' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ఆరా తీసినట్లు సమాచారం. ఈమేరకు మంగళవారం ఎంఈఓ రాందాస్ పాఠశాలను సందర్శించి మాట్లాడారు. పాఠశాల ఆవరణలో మద్యం తాగితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

దొనికెన కుమారస్వామికి కలాం స్ఫూర్తి పురస్కారం



తొర్రూరు: తొర్రూరు పట్టణానికి చెందిన సాహితీవేత్త, సామాజిక కార్యకర్త దొనికెన కుమారస్వామికి అరుదైన గౌరవం దక్కింది. సాహితీ, విద్యారంగాల్లో కుమారస్వామి చేస్తున్న కృషిని గుర్తించిన నెల్లూరుకు చెందిన పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తి పురస్కారం అందించి గౌరవించింది. తాజాగా హైదరాబాద్‌లోని త్యాగరాయగాన సభలో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి చేతుల మీదుగా దొనికెన అవార్డు అందుకున్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి



గార్ల: వసతి గృహాల్లో బాలికలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో ఆదేశించారు. మంగళవారం గార్లలోని బీసీ, ఎస్సీ బాలికల వసతి గృహాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. వసతి గృహంలో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి అజ్మీరా కిషన్‌ను ఆదేశించారు. బాలికల విద్యపై దృష్టి పెట్టాలని సూచించారు. వార్డెన్లు నిత్యం విద్యార్థినులకు అందుబాటులో ఉండాలన్నారు. తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ మంగమ్మ, ఆర్‌ఐ రామకృష్ణ ఉన్నారు.

నేడు కౌన్సెలింగ్

మహబూబాబాద్ అర్బన్: కేజీబీవీలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఖాళీగా ఉన్న సబ్జెక్ట్ పోస్టుల భర్తీకి పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను బుధవారం కలెక్టర్ కార్యాయలంలో ఉదయం 10:30 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ రాజేశ్వర్ మంగళవారం తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక సెట్ గెజిటెడ్ అటెస్టెడ్ జిరాక్స్‌తో హాజరుకావాలన్నారు. వివరాలకు డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయం

మహబూబాబాద్ అర్బన్: ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయమని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కంకరబోర్డు ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం, ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. నల్లగొండ ఖమ్మం, వరంగల్ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను పీఆర్‌టీయూ నుంచి పోటీ చేస్తున్నట్లు చెప్పారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బద్రినారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు గీత, ఉమాదేవి, వెంకట్‌రెడ్డి, సుజాత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోట్యా నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దసరా ధమాకా!

ఆర్టీసీ వరంగల్ రీజియన్ ఆదాయం రూ.28.99 కోట్లు

- తిరిగిన కిలో మీటర్లు 50 లక్షలు
- ఆక్యుపెన్సీ రేషియో 91 శాతం

హన్మకొండ: సద్దుల బతుకమ్మ, దసరా పండుగను ఆర్టీసీ సద్వినియోగం చేసుకుంది. రోజూ నడిచే బస్సులతోపాటు ప్రత్యేక సర్వీసులను నడపడం ద్వారా మరింత ఆదాయం సంపాదించుకుంది. ఈనెల 1 నుంచి 14వ తేదీ వరకు వరంగల్ రీజియన్‌లో టీజీఎస్ ఆర్టీసీ రూ.28.99 కోట్ల ఆదాయాన్ని రాబట్టుకుంది. 14 రోజులపాటు 50 లక్షల కిలోమీటర్లు బస్సులు తిరిగాయి. 91 శాతం ఆక్యుపెన్సీ రేషియో ద్వారా కిలోమీటర్‌కు రూ.58 ఆదాయం పొందింది. బతుకమ్మ, దసరా పండుగకు విద్యాసంస్థలు సెలవులు ఇచ్చినప్పటి నుంచి ప్రయాణికుల రద్దీని బట్టి ప్రైవేట్ వాహనాలకు అవకాశం ఇవ్వకుండా సంస్థ వివిధ రూట్లకు సర్దుబాటు చేసి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంది.

డిపోల వారీగా ఆదాయం వివరాలు

	హనుమకొండ	జనగామ	వరంగల్-1	వరంగల్-2	మానుకోట	నర్సంపేట	పరకాల	తొర్రూరు	భూపాలపల్లి
ఆదాయం	373.22	338.69	467.24	393.18	203.02	284.87	223.94	329.99	285.47
కిలోమీటర్లు	6.72	6.16	7.82	7.16	3.46	4.92	3.79	5.22	4.75
ఈపీకే	55.50	54.97	59.76	54.95	58.61	57.89	59.15	63.27	60.07
ఓఆర్	81	94	83	86	103	96	98	104	97

- ఆదాయం (రూ.లక్షల్లో) • తిరిగిన కిలోమీటర్లు (లక్షల్లో)
- ఎర్నింగ్స్ పర్ కిలోమీటర్ (ఈపీకే) రూ.లలో • ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) శాతంలో

అత్యధిక ఆదాయం వరంగల్-1 డిపో




- పండుగ రోజుల్లో వరంగల్-1 డిపోకు అత్యధికంగా రూ.467.24 లక్షలు ఆదాయం వచ్చింది.
- అతి తక్కువగా మహబూబాబాద్ డిపో రూ.203.02 లక్షలు ఆదాయం సాధించింది.
- వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల్లో ఆక్యుపెన్సీ రేషియోలో తొర్రూరు డిపో 104 శాతంతో అగ్రభాగాన నిలవగా.. మహబూబాబాద్ డిపో 103 శాతంతో ద్వితీయ స్థానంలో నిలిచింది.
- హనుమకొండ 81శాతం ఆక్యుపెన్సీ రేషియోతో చివరి స్థానంలో ఉంది.
- తొర్రూరు డిపో కిలోమీటర్‌కు రూ.63.27 ఆదాయం రాబట్టి కిలో మీటర్ లెక్కన వరంగల్ రీజియన్‌లో అగ్రభాగంలో నిలిచింది.
- భూపాలపల్లి డిపో కిలోమీటర్‌కు రూ.60.07 ఆదాయాన్ని పొంది రెండో స్థానంలో నిలిచింది.
- వరంగల్-1 డిపో 7.82 లక్షల కిలో మీటర్లు బస్సులు నడిపి మొదటి స్థానంలో నిలవగా.. 7.16 లక్షల కిలో మీటర్లు బస్సులు నడిపి వరంగల్-2 రెండో స్థానంలో నిలిచింది.

పంపిణీపై ప్రత్యేక దృష్టి

గతంలో నాసిరకం చేపపిల్లలు, లెక్కల్లో తేడాలు

- అప్రమత్తమైన జిల్లా మత్స్యశాఖ అధికారులు
- నాణ్యమైన పిల్లలు అందించడమే లక్ష్యం
- చెరువుల్లో చేపపిల్లలు పోసే సమయంలో వీడియో చిత్రీకరణ



సాక్షి, మహబూబాబాద్: తెలంగాణ పల్లెల్లో సంపద సృష్టించాలి. ఇందుకోసం కులవృత్తులను బలోపేతం చేయాలనే ఆలోచనతో ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రభుత్వమే చేపపిల్లలను కొనుగోలు చేసి ఉచితంగా పంపిణీ చేస్తోంది. అయితే గతంలో పంపిణీలో పలు అవకతవకలు జరిగినట్లు విమర్శలు, ఆరోపణలు వచ్చాయి. నాసిరకం పిల్లలు, లెక్కల్లో తేడా వచ్చిందని పలువురు మత్స్యకారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా చేసిన సంఘటనలు ఉన్నాయి. దీంతో గత ఏడాది నుంచి చేపపిల్లల దిగుమతి నుంచి చెరువుల్లో పోసే వరకు అంతా వీడియో చిత్రీకరించేలా చర్యలు తీసుకున్నారు. అయినా ఒకటి రెండు చోట్ల అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు ఉన్నాయి.

సగానికి కుదింపు

గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం సరఫరా చేసే చేపపిల్లలను సగానికి కుదించారు. గతేడాది జిల్లాలోని 1,250 చెరువుల్లో 4.25 కోట్ల చేపపిల్లలు పంపిణీ చేశారు. ఇందులో 35–40ఎంఎం సైజు చేప పిల్లలు 2కోట్లు, 80–100 ఎంఎం సైజు పిల్లలు 2.25కోట్లు పంపిణీ చేశారు. కాగా ఇటీవల జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలతో 127 చెరువులు, కుంటలు తెగిపోయాయి. ఇందులో మత్స్యసొసైటీలు చేపలు పెంచుకునే చెరువులు 50కి పైగా ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. వీటిని దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది 35–40 ఎంఎం సైజు పిల్లలు కోటి, 80–100 ఎంఎం సైజు పిల్లలు 1.10కోట్లు పంపిణీకి టెండర్ ప్రక్రియను పూర్తి చేశారు. అంటే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఉచితంగా ప్రభుత్వం సరఫరా చేసే పిల్లలు 50శాతానికి కుదించినట్లు స్పష్టమవుతోంది. అయితే ఇప్పటికే గత ఏడాది పట్టకుండా చెరువులో ఉన్న చేపలు, జూన్ మొదటి వారంలో కురిసిన వర్షాలకు సొసైటీ సభ్యులు కొనుగోలు చేసి పోసిన చేపలు మొత్తం వర్షానికి కొట్టుకుపోయాయి. దీంతో జిల్లాలోని మత్స్యకారులకు రూ.3 కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని అంచనా. ప్రస్తుతం తక్కువగా చేపపిల్లలను పంపిణీ చేస్తుండటంతో మత్స్యకారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

చెరువులు, సొసైటీల వివరాలు

జిల్లాలోని చెరువులు	:1,229
మత్స్యసొసైటీలు	:200
సొసైటీలోని సభ్యులు	:15,239
పంపణీ చేసే పిల్లలు	:2.10కోట్లు

గతంలో ఆరోపణలు..

టెండర్ల వివాదంతో ఒక సంవత్సరం చేపపిల్లలను పంపిణీ చేయకపోవడం, తర్వాత సంవత్సరం నుంచి పంపిణీ సక్రమంగా జరగలేదని ఆరోపణలు ఉన్నాయి. పంపిణీ చేసేపిల్లల సైజ్ అనేది ఉత్పత్తి సమయంలో తీసుకునే జాగ్రత్తలు, పెంపకంపై ఆధారపడి ఉంటుంది. అయితే గతంలో ఉత్పత్తి చేసే కేంద్రాలు లేకపోయినా.. కొందరు కాంట్రాక్టర్లు వేరే ఉత్పత్తి కేంద్రాలను చూపించి కాంట్రాక్టు దక్కించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం కాకుండా నాసిరకం పిల్లలు పంపిణీ చేశారని, దీంతో జిల్లాలోని పలు చెరువుల్లో ఆరు,ఏడు నెలలు పెంచినా 500 గ్రాముల సైజుకు కూడా పెరగలేదని మత్స్యకారులు ఆరోపించారు. అలాగే చెరువుల్లో తక్కువ పిల్లలు పోసి ఎక్కువ లెక్కలు చూపించినట్లు కూడా విమర్శలు ఉన్నాయి. అయితే వీటిని పరిశీలించాల్సిన అధికారులు కొందరు కాంట్రాక్టర్లతో కుమ్మక్కు కావడం, ముడుపులు తీసుకొని చూసీచూడనట్లుగా వ్యవహరించారని మత్స్యకారులు ఆరోపించారు. కాగా ఈ ఏడాది పంపిణీలో జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతీ పిల్లను లెక్కించాలని, జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు.

అంతా గందరగోళం



కౌన్సెలింగ్‌కు హాజరైన నూతన టీచర్లు



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

- ఉదయమని చెప్పి మధ్యాహ్నం టీచర్లకు కౌన్సెలింగ్
- సెంటర్ వద్ద ఉపాధ్యాయ సంఘాల హల్‌చల్
- ప్రేక్షకపాత్ర వహించిన విద్యాశాఖ అధికారులు



అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీ అందజేస్తున్న డీఈఓ రాజేశ్వర్

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఫాతిమా హైస్కూల్‌లో నూతన ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని సోమవారం ఫోన్లు, మెసేజ్‌ల ద్వారా సమాచారం అందించారు. కాగా మంగళవారం ఉదయం ఉపాధ్యాయులు హాజరు కాగా.. కౌన్సెలింగ్ వాయిదా వేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. అయితే మళ్లీ మధ్యాహ్నం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని సమాచారం ఇవ్వడంతో ఉపాధ్యాయులు గందరగోళానికి, ఆందోళనకు గురయ్యారు.

ఉపాధ్యాయ సంఘాల హల్‌చల్..

జిల్లాలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తమ స్కూళ్లకు నూతన ఉపాధ్యాయులను అలాట్ చేయాలని కౌన్సెలింగ్ సెంటర్‌లో హల్‌చల్ చేశారు. తమ పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నారని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులను అలాట్ చేయాలని ఒకరు.. కాదుకాదు తమ పాఠశాలలో తక్కువ మంది టీచర్లు ఉన్నారని.. మాకే ఎక్కువమందిని అలాట్ చేయాలని కౌన్సెలింగ్ సెంటర్‌లో ఘర్షణకు దిగారు. కౌన్సెలింగ్ కు హాజరైన నూతన ఉపాధ్యాయుల ముందే ఉపాధ్యాయ సంఘాల నాయకులు దుర్భాషలాడుకోవడంతో పాటు ఒకరినొకరు తోసుకుంటూ ఘర్షణ వాతావరణం సృష్టించారు. ఇదిలా ఉండగా సర్టిఫికెట్ల పరిశీలన, పాఠశాలల ఎంపిక విషయంలో లోకల్ బాడీ, ప్రభుత్వ పాఠశాలలను ఎంచుకునే సమయంలో అధికారులు తమను పక్కదారి పట్టించి మోసం చేశారని పలువురు ఉపాధ్యాయులు ఆరోపించారు.



చంటిబిడ్డతో కౌన్సెలింగ్‌కు హాజరైన టీచర్

విద్యాశాఖ అధికారుల చోద్యం..

కౌన్సెలింగ్ సెంటర్‌లో ఉపాధ్యాయ సంఘాల నాయకులు గొడవలు పడుతున్నా.. తమకు సరైన పాఠశాలలో అలాట్‌మెంట్ జరగలేదని అభ్యర్థులు మొత్తుకున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకుండా ప్రేక్షక పాత్ర పోషించారు. అభ్యర్థుల సందేహాలను తీర్చడంలో కూడా నిర్లక్ష్యం వహించి తాము బిజీగా ఉన్నామని పొంతనలేని సమాధానం తెలిపారు. కాగా నూతన ఉపాధ్యాయులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీలను డీఈఓ రాజేశ్వర్ రావు, విద్యాశాఖ అధికారులు అందజేశారు.

పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

కురవి: దసరా సెలవులు ముగిసి తిరిగి విద్యార్థులు వస్తున్నందున పాఠశాలలు, హాస్టళ్లలో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ ఇతర సౌకర్యాలు కల్పించాలని వార్డెన్లు, ప్రిన్సిపాళ్లకు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ స్కూల్, ఆశ్రమ పాఠశాల, పీహెచ్‌సీలను మంగళవారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీహెచ్‌సీల్లో సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. గ్రామాల్లో ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల ప్రత్యేక అధికారులు పాఠశాలలు, వసతిగృహాల తనిఖీలు నిర్వహించి విద్య, వైద్యం శానిటేషన్ వంటి సౌకర్యాలపై ప్రతీ రోజు నివేదికలు సమర్పించాలన్నారు.

24క్వింటాళ్ల బియ్యం పక్కదారి

- గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఘటన

దంతాలపల్లి: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో బియ్యం నిల్వల్లో తేడా ఉందని అందిన ఫిర్యాదు మేరకు మంగళవారం తహసీల్దార్ చంద్రజగదీశ్వర్ తనిఖీ చేశారు. ఈమేరకు 24క్వింటాళ్ల బియ్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. దీంతో ఆయన ఐటీడీఏ ఉన్నతాధికారులకు వెంటనే ఫ్యాక్స్ ద్వారా నివేదిక అందజేశారు. అధికారుల ఆదేశాల మేరకు గిరిజన అభివృద్ధి సహాయ అధికారి దేశిరామ్ ఆశ్రమ పాఠశాలలో సందర్శించారు. తనిఖీ నిర్వహించి.. విచారణ చేపట్టారు. వార్డెన్ అధ్వర్యంలోనే బియ్యం గోల్‌మాల్ జరిగిందని విచారణలో తేల్చారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని చెప్పారు. కాగా బియ్యాన్ని పక్కదారి పట్టించిన వార్డెన్ ఠాగూర్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు దేశిరామ్‌కు లేక రాసిచ్చాడు. ఆయన స్థానంలో గతంలో వార్డెన్ బాధ్యతలు నిర్వర్తించిన నాగరాజుకు ఇన్‌చార్జ్ ఇచ్చారు.



పాఠశాలలో తనిఖీ చేస్తున్న అధికారి దేశిరామ్

విద్యుత్‌శాఖలో బదిలీలు

నెహ్రూసెంటర్: జిల్లా విద్యుత్‌శాఖలో బదిలీల ప్రక్రియ పూర్తయింది. జిల్లా పరిధిలో 129 మంది ఉద్యోగులు సర్కిల్ పరిధితో పాటు ఇతర ప్రాంతాలకు బదిలీ అయినట్లు జిల్లా విద్యుత్‌శాఖ అధికారి జె.నరేష్ మంగళవారం తెలిపారు. విద్యుత్‌శాఖలో పని చేస్తున్న ఏఈలు, ఏడీఈలు, డీఈ టెక్నికల్, సివిల్ ఇంజనీర్లు, వివిధ విభాగాల్లోని ఉద్యోగులు బదిలీ అయ్యారని తెలిపారు. మహబూబాబాద్ డివిజన్ పరిధిలో 33 మంది, తొర్రూరు పరిధిలో 26, మహబూబాబాద్ సర్కిల్ పరిధిలో 70 మంది మొత్తంగా 129 మంది ఉద్యోగులు వివిధ ఏరియాలు, ప్రాంతాలకు బదిలీ అయ్యారు. బదిలీ అయిన ఉద్యోగుల స్థానంలో కొంతమంది చేరగా మరికొంత మంది రావాల్సి ఉందని ఎస్‌ఈ తెలిపారు.

బీసీ గురుకులాలకు తాళం!

అద్దె చెల్లించడం లేదని గేట్లకు తాళం వేసిన యజమానులు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 36 గురుకులాలు అద్దె భవనాల్లోనే
- ఏడు మాత్రమే సొంత భవనాల్లో..
- మార్చినుంచి ఇప్పటి వరకు చెల్లించని అద్దె
- ప్రతీనెల చెల్లించాల్సింది కనీసం రూ. 74నుంచి రూ.75లక్షల వరకు

సాక్షిప్రతినిధి, వరంగల్/విద్యారణ్యపురి: మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకులాలకు తాళం పడింది. ఇప్పటికే అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుండగా మరోవైపు నెలల తరబడి అద్దె చెల్లించకపోవడం.. దసరా సెలవులు ముగియడం.. మంగళవారంనుంచి విద్యార్థులు రాక ప్రారంభంకావడంతో మొదటిరోజే అద్దెభవనాల యజమానులు పాఠశాల గేట్లకు తాళం వేసి నిరసన తెలిపారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులు గంటల తరబడి గేటు బయటే పడిగాపులు కాశారు. కొన్నిచోట్ల ప్రిన్సిపాళ్ల యజమానులకు నచ్చజెప్పినట్లు తెలుస్తోంది. సమస్య తీవ్రత ఎక్కువగా ఉండడంతో సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పరిష్కరించే దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం.

మూడో భాగం గురుకులాలు అద్దె భవనాల్లోనే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 43 వరకు మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకులాలు ఉన్నాయి. ఇందులో ఏడు గురుకులాలకు ప్రభుత్వ భవనాలు ఉండగా, మిగతా 36 అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. వీటికి ప్రతీనెల రూ.74లక్షలనుంచి రూ.75 లక్షల వరకు ప్రభుత్వం అద్దె చెల్లించాల్సింటుంది. ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటివరకు అద్దె చెల్లించడం లేదు. ఆయా యాజమాన్యాలు తమకు అద్దెబిల్లులు చెల్లించాలని పలుసార్లు కోరినప్పటికీ ప్రభుత్వం నుంచి విడుదల కాకపోవడంతో చివరికి దసరా సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచే రోజు (మంగళవారం) గురుకులాల గేట్లకు తాళాలు వేసి నిరసన తెలిపారు. ఈ విషయమై అద్దెభవనాల యాజమాన్యాల అసోసియేషన్ అధ్యక్షుడితో ఉమ్మడి జిల్లా ఆర్‌సీఓ ఎం.రాజ్‌కుమార్ ఫోన్‌లో మాట్లాడారు.

అద్దె బకాయిలు చెల్లించేందుకు సంబంధిత ఉన్నతాధికారులు యత్నిస్తున్నారని, బిల్లులు వస్తాయని,సహకరించాలని తెలియజేసినట్లు రాజ్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు. ఉన్నతాధికారులు కూడా సంబంధిత అద్దె యాజమాన్యాలతో మాట్లాడినట్లు సమాచారం. ఆ తరువాత కొంతవరకు సమస్య సద్దుమణిగి యజమానులు గేట్లకు తాళాలు తీసినట్లు తెలిసింది.

డిగ్రీ కళాశాలలు ఇలా..

బీసీ గురుకులాల్లో మహబూబాబాద్ జిల్లాలో రెండు డిగ్రీ కళాశాలలు, జనగామలో ఒకటి, భూపాలపల్లిలో ఒకటి అద్దె భవనాల్లో ఉన్నాయి. హనుమకొండ జిల్లా కాజీపేటలో మహిళలకు లా కాలేజీ, ములుగు జిల్లాకు మంజూరైన డిగ్రీ కాలేజీ కూడా లా కాలేజీ సొంత భవనంలోనే నడుపుతున్నారు.



తొర్రూరులోని బీసీ గురుకులానికి తాళం వేస్తున్న భవన యజమాని

జిల్లాల వారీగా బీసీ గురుకులాలు ఇలా..

జిల్లా	మొత్తం	సొంత భవనాలు	అద్దె భవనాలు
హనుమకొండ	12	04	08
వరంగల్	07	00	07
జనగామ	07	01	06
ములుగు	03	01	02
జేఎస్‌భూపాలపల్లి	05	02	03
మహబూబాబాద్	06	00	06

- ములుగు జిల్లాలో మంజూరైన 3 గురుకులాలను అక్కడ ఏర్పాటు చేయకుండా ఒకటి హనుమకొండ జిల్లా శాయంపేటలో, వరంగల్ జిల్లాలో ఆరెపల్లిలో మరోటి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లిలో ఒకటి ఏర్పాటు చేశారు.

గేటు బయటే విద్యార్థులు, ఉపాధ్యాయులు

- అద్దె చెల్లించలేదని గురుకులాల గేట్లకు తాళం
- భవన యజమానుల నిరసన

- వివరాలు 10లో ▸

క్లుప్తంగా

20న ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 20వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికల ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఖోఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తోట శ్యాంప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారుల ఎత్తు, బరువు, వయసు కలుపుకుని 250 పాయింట్లు దాటొద్దని, నవంబర్ 11, 2006 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఉదయం 10 గంటలకు జేఎన్ఎస్‌లోని ఖోఖో స్టేడియం వద్ద ఆధార్, పుట్టిన తేదీ సర్టిఫికెట్లతో ఖోఖో కోచ్ రాజారపు రమేశ్‌ను సంప్రదించాలని సూచించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో కూడిన జిల్లా జట్టు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయిలో పాల్గొంటుందని తెలిపారు.

పండుగకు వచ్చి ప్రాణం తీసుకున్నాడు..

- క్షణికావేశంలో యువకుడి ఆత్మహత్య
- మహబూబాబాద్‌లో ఘటన


సురేశ్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : దసరా పండుగకు ఇంటికి వచ్చిన ఓ యువకుడు క్షణికావేశంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం రాత్రి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని నందమూరి నగర్ కాలనీకి చెందిన మంజల సురేశ్ (30), భార్య కల్యాణి, కుమారుడు, కుమార్తెతో కలిసి బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్ వెళ్లాడు. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో దసరా సందర్భంగా ఇంటికి వచ్చాడు. పండుగ అనంతరం హైదరాబాద్ వెళ్దామని భార్య కల్యాణి చెప్పగా మద్యం మత్తులో ఉన్న సురేశ్ తరువాత వెళ్దామని చెప్పాడు. తల్లి సత్తెమ్మ, భార్య కల్యాణి.. మద్యం ఎందుకు సేవిస్తున్నావని మందలించగా, మీరు వెళ్లండి నేను తరువాత వస్తానని చెప్పాడు. దీంతో కల్యాణి తన కుమారుడు, కుమార్తెతో కలిసి హైదరాబాద్ వెళ్లడానికి రైల్వే స్టేషన్ చేరుకుంది. బయట ఉన్న తల్లి సత్తెమ్మ ఇంట్లోకి వచ్చి చూడగా సురేశ్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి సత్తెమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్సై జోవెల్ ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి శవ పంచనామా జరిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

గేటు బయటే విద్యార్థులు, ఉపాధ్యాయులు

అద్దె చెల్లించలేదని గురుకులాల గేట్లకు తాళం | **భవనాల యజమానుల నిరసన**

తొర్రూరు/ఖానాపురం/చెన్నారావుపేట/దుగ్గొండి/గూడూరు/రేగొండ/ఖిలావరంగల్/భూపాలపల్లి అర్బన్/ములుగు రూరల్: : గురుకులాల భవనాలకు రాష్ట్ర ప్రభుత్వం అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో మంగళవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ బాలుర గురుకులం, మైనార్టీ బాలికల గురుకులం, నాంచారి మడూరులోని బీసీ బాలుర డిగ్రీ గురుకుల కళాశాల గేట్లకు యజమానులు తాళాలు వేసి నిరసన తెలిపారు. దీంతో విధులకు హాజరయ్యేందుకు వచ్చిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆరుబయటే నిరీక్షించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ 8 నెలలుగా ప్రభుత్వం అద్దె చెల్లించలేదని, పాఠశాల భవనాలకు నెలకు రూ.3 లక్షలు, కళాశాల భవనాలకు రూ. 4.50 లక్షలు చొప్పున చెల్లించాల్సి ఉందన్నారు. అనంతరం అధికారుల హామీ మేరకు భవనాల యజమానులు గురుకులాల గేట్లు తెరిచారు.

- గూడూరు మండలంలోని మర్రిమిట్ట శివారు మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల విద్యాలయానికి మంగళవారం భవన సముదాయ యజమాని నితిన్ తాళం వేశారు. సమాచారం అందుకున్న గురుకుల విద్యాలయాల సెక్రటరీ.. వచ్చే నెల 4వ తేదీ లోపు అద్దె డబ్బులు చెల్లిస్తామని ఫోన్‌లో హామీ ఇచ్చారు.
- వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని ఐనపల్లిలోని జ్యోతిరావుపూలే పాఠశాలకు యజమాని మంగళవారం తాళం వేశారు. దీంతో మధ్యాహ్నం వరకు ఉపాధ్యాయులు లోపలికి వెళ్లకుండా ఆగిపోయారు.
- దుగ్గొండి మండలం గిర్నిబావిలోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల గేటుకు యజమానులు బైరెడ్డి రాజేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి తాళం వేశారు.
- దుగ్గొండి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల.. చెన్నారావుపేట మండల కేంద్రంలోని సిద్దార్థ గురుకుల హైస్కూల్ భవనంలో కొన్నేళ్లుగా నడుస్తోంది. అంతేకాకుండా ఇందులోనే హాస్టల్ కూడా నడుస్తోంది. అద్దె డబ్బులు చెల్లించకపోవడంతో భవనానికి తాళం వేసినట్లు యజమాని గోపాల్‌రెడ్డి తెలిపారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని లింగాల మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే బాలికల హాస్టల్ భవనానికి 8 నెలలుగా అద్దె చెల్లించక పోవడంతో యజమానికి గేటుకు తాళం వేశారు.


చెన్నారావుపేట : భవనానికి తాళం వేస్తున్న యజమాని కంది గోపాల్‌రెడ్డి


గూడూరు: మహాత్మా జ్యోతిరావుపూలే గురుకులానికి తాళం వేస్తున్న భవన యజమాని నితిన్

- అద్దె బకాయిలు చెల్లిచాలని డిమాండ్ చేస్తూ వరంగల్ ఉర్సు గుట్ట వద్ద మహాత్మా జ్యోతిరావుపూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాల భవనానికి తాళం వేశారు. దీంతో కళాశాల సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు బయటే నిరీక్షించారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాశ్‌కాలనీలోని మైనారిటీ గురుకుల పాఠశాల గేట్‌కు భవన యాజమాని నాగుల దేవేందర్‌రెడ్డి తాళం వేశారు. ఉదయం 8గంటలకే తాళం వేయడంతో అధ్యాపకులు సాయంత్రం వరకు గురుకుల పాఠశాల ఎదుటే చెట్ల కింద వేచి ఉన్నారు. విద్యార్థులు తిరిగి ఇంటికి వెళ్లారు.
- ములుగు మండలం మల్లంపల్లిలో అద్దెకు కొనసాగుతున్న ఏటూరునాగారానికి చెందిన గురుకుల పాఠశాలకు యజమాని తాళం వేశారు. సాయంత్రం వరకు సమస్య పరిష్కారం కాకపోవడంతో విద్యార్థులు తిరిగి ఇళ్లకు వెళ్లిపోయారని పాఠశాల ప్రిన్సిపాల్ అంకయ్య తెలిపారు.

రామప్ప ఖ్యాతి ప్రపంచానికి చాటాలి

- కలెక్టర్ దివాకర టీఎస్
- ఆలయంలో వరల్డ్ హెరిటేజ్ క్యాంపెయిన్ ప్రారంభం



మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర టీఎస్

వెంకటాపురం(ఎం): రామప్ప ఆలయ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలని కలెక్టర్ దివాకర టీఎస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని రామప్ప దేవాలయ గార్డెన్‌లో వరల్డ్ హెరిటేజ్ క్యాంపెయినింగ్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారసత్వ సంపదను భావితరాలకు అందించడానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పనిచేయాలని పేర్కొన్నారు. 'వర్కింగ్ ఆన్ ది ఫ్యూచర్' అనే అంశంపై వరల్డ్ హెరిటేజ్ వలంటీర్స్–2024 క్యాంపెయిన్‌ను అక్టోబర్ 15 నుంచి 26 వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 40 మంది వలంటీర్లతో పాటు ఉమ్మడి వరంగల్‌కు చెందిన మరో 40 మంది వలంటీర్లుగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, పర్యాటకం, కాకతీయుల ఇంజనీరింగ్ ప్రతిభ, ఇతర అంశాలపై బోధన తరగతులతో పాటు ఫీల్డ్ ట్రిప్స్ ఉంటాయని, ఈ క్యాంపెయిన్ వలంటీర్లకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పాండురంగారావు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యుడు శ్రీధర్‌రావు, జిల్లా టూరిజం అధికారి శివాజీ, అసిస్టెంట్ ప్రమోషన్ అధికారి సూర్యకిరణ్, యోగా ఇన్‌స్ట్రక్టర్ రాంబాబు, గైడ్‌లు విజయ్‌కుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

యాంటీ డ్రగ్స్ టీమ్, పోలీసుల తనిఖీలు


తనిఖీలు చేస్తున్న పోలీసులు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే స్టేషన్‌లో మంగళవారం యాంటీ డ్రగ్ టీమ్, కాజీపేట పోలీసులు సంయుక్తంగా నార్కోటిక్ డాగ్ సహాయంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంలు, ప్రయాణికులు వేచి ఉండే గదులు, అనుమానాస్పద ప్రయాణికులు, వారి బ్యాగులను తనిఖీ చేశారు. ఈతనిఖీలో కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సైలు లవన్‌కుమార్, నవీన్, యాంటీ డ్రగ్స్ టీమ్ ఇన్‌స్పెక్టర్ జె.సురేశ్, ఆర్ఎస్సైలు పూర్ణచంద్రారెడ్డి, మనోజ్‌రెడ్డి, నాగరాజు, ఆర్ఐ శివకేశవులు, సిబ్బంది పాల్గొన్నారు.

మూడుశాతం రిజర్వేషన్ అమలు చేయాలి

- ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్

హన్మకొండ చౌరస్తా: మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ముస్లింలకు 3 శాతం రిజర్వేషన్ అమలు చేయడం వల్ల అనేక మంది ఉద్యోగాలు పొందారని, ప్రస్తుత ప్రభుత్వం ఆ రిజర్వేషన్ అమలు చేయాలని ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ అన్నారు. హనుమకొండ రాయపురలోని జక్రియా ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం మైనారిటీ ఇంటలెక్చువల్ ఫోరం, ముస్లిం వెల్ఫేర్ సొసైటీ, ఆల్ ఫాయిజన్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో దళితుల కంటే ముస్లింలు సామాజికంగా, విద్యా రంగంలో వెనుకబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లిం సంక్షేమం కోసం కేవలం రూ.2వేల కోట్లు కేటాయిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో రూ.5వేల కోట్లు చేర్చిందని, త్వరలోనే ఆ నిధులు మంజూరయ్యేలా సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానన్నారు. ప్రతీ పేద ముస్లింకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. కేంద్రంలో కుర్చీ కోసం బీజేపీ సర్కార్ మత విద్వేషాలను రెచ్చగొడుతోందని విమర్శించారు. డాక్టర్ అనీస్‌సిద్దిఖీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూపాషా, డాక్టర్ జమాలషరీఫ్, డాక్టర్ రజామాలిక్, ప్రొఫెసర్ ముస్తఫా, డాక్టర్ రాజ్‌మహ్మద్, సిరాజ్ అహ్మద్, నయీమొద్దీన్, నస్రీన్ వాహిది, ఇస్మాయిల్ షంషీ, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి వరంగల్ జిల్లా గాయకుల ఎంపిక


మాట్లాడుతున్న వరంగల్ శ్రీనివాస్

నయీంనగర్: 'నూరేండ్ల నా ఊరు' గేయం కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి గాయకులను ఎంపిక చేసి చారిత్రక పాటలో అవకాశం కల్పించనున్నట్లు కవి, గాయకుడు వరంగల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద సంవత్సరాల పల్లె చరిత్ర, మానవ జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, మానవీయ విలువలు చాటి చెప్పేలా అప్పటి యాస, భాషతో కూడిన సాహిత్యాన్ని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో 243 చరణాలు కలిగిన గేయం రచించి దానిని 243 మంది గాయకులతో పాడిస్తామన్నారు. ఇందుకోసం రెండు తెలుగు రాష్ట్రాల ఉంచి గాయకులను ఎంపికచేస్తామన్నారు. మొదట ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ప్రారంభిస్తామన్నారు. రేపు (బుధవారం) కేయూ బైపాస్‌లోని శారదా ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు గాయకుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. సమావేశంలో కళాకారులు గిద్దె రాంనర్సయ్య, జూపాక శివ, వెంకన్న, సునీల్, సంజీవ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య ప్రవేశాల గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్ : కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రం అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్, ఓరియంటేషన్ కోర్సుల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు దూరవిద్య కేంద్రం (ఎస్‌డీఎల్‌సీఈ) డైరెక్టర్ వల్లూరి రామచంద్రం మంగళవారం తెలిపారు. ఈనెల 15వతేదీతో గడువు ముగియడంతో పెంపుదల చేసినట్లు వెల్లడించారు. అభ్యర్థులు ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చుని వివరించారు. మొత్తం 33 కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నామన్నారు. డిగ్రీలో బీఏ, బీకాం, జనరల్ కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్సీ, బీఎల్, బీఎస్సీ, ఎం.ఏ తెలుగు, ఇంగ్లిష్, హిందీ, సంస్కృతం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, హిస్టరీ, రూరల్ డెవలప్‌మెంట్, సోషియాలజీ, హెచ్ఆర్ఎం, ఎం.కామ్, సోషల్ వర్క్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎమ్మెస్సీ సైకాలజీ, గణితశాస్త్రం, ఎన్విరాన్మెంటల్ సైన్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, వృక్ష, జంతు శాస్త్రాలు, ఎంఎల్ఐఎస్సీ ఉన్నాయని తెలిపారు. అలాగే, డిప్లొమా కోర్సుల్లో కంప్యూటర్ అప్లికేషన్స్, గైడ్స్ అండ్ కౌన్సెలింగ్, యోగా, సర్టిఫికెట్ కోర్సులో సీఎల్ఐఎస్సీ, మిమిక్రీలో ఓరియంటేషన్ కోర్సుల్లోనూ ప్రవేశాలు పొందొచ్చన్నారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, ఫొటో జత చేసి కోర్సు రుసుం ఆన్‌లైన్‌లో కాని దూర విద్య కేంద్రం ఎస్‌బీఐ ఎక్స్‌టెన్షన్ కౌంటర్ నుంచి చలాన్ ద్వారా కాని చెల్లించొచ్చన్నారు. కోర్సులు, ఫీజులు వివరాలకు 0870–24611480,2461490 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆప్త మిత్రుడిని కోల్పోయాం..

- నరేశ్‌రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది
- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు
- మాజీ మంత్రి హరీశ్‌తోపాటు పలువురు బీఆర్ఎస్ నేతల నివాళి



నరేశ్‌రెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్, రాజ్యసభ సభ్యుడు వద్ది రాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, తదితరులు

మరిపెడ రూరల్: ఆప్త మిత్రుడు నూకల నరేశ్ రెడ్డిని కోల్పోయామని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నూకల నరేశ్‌రెడ్డి ఇటీవల మృతి చెందిన విషయం విధితమే. కాగా, ఆయన వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం నిర్వహించిన దశ దిన కర్మలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరై నరేశ్‌రెడ్డి చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేశ్ రెడ్డి కుమారులు అనిరుధ్‌రెడ్డి, అభినవ్‌రెడ్డిని మంత్రులు పరామర్శించారు. అనంతరం మంత్రులు పొంగులేటి, తుమ్మల మాట్లాడుతూ ఫ్యామిలీ రిలేషన్ కంటే కూడా వ్యక్తిగతంగా నరేశ్‌రెడ్డి తమకు ఆప్త మిత్రుడన్నారు. నరేశ్‌రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, భూక్య మురళీనాయక్, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్రారెడ్డి, జిల్లా నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, పెండ్లి రఘువీర్ రెడ్డి, ఘనపురపు అంజయ్య, వేణుగోపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్, గొడుగు శ్రీనివాస్, కాలం శ్రీనివాస్‌రెడ్డి, పానుగోతు రాంలాల్, గంధసిరి అంబరీష, మెంచ్ అశోక్, పటేల్ దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల ఘననివాళి..

నరేశ్‌రెడ్డి దశ దిన కర్మలకు బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు నరేశ్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి వెంట రాజ్య సభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్ రెడ్యానాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, మాజీ ఎంపీలు నామా నాగేశ్వరరావు, మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ టీడీ ఎస్ఎంఎస్ చైర్మన్ కుడితి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

సీపీఎం ఆధ్వర్యంలో నూకల నరేశ్‌రెడ్డి చిత్ర పటానికి నాయకులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సోమయ్య, గునిగంటి రాజన్న, అల్వాల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ధరణి కన్నుమూత

- చికిత్స పొందుతూ మృతి


ధరణి(ఫైల్)

నల్లబెల్లి/హసన్‌పర్తి: నల్లబెల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా కానిస్టేబుల్ జోరుక ధరణి(24) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై ప్రశాంత్ బాబు కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెంబర్తికి చెందిన జోరుక రాజేశ్వరి, కుమారస్వామి దంపతుల కూతురు ధరణి నల్లబెల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ పోలీస్ క్వార్టర్స్‌లో ఉంటోంది. తన ద్విచక్ర వాహనం కోసం తీసుకొచ్చిన పెట్రోల్‌ను గదిలో ఉంచింది. ఈ నెల 13న పెట్రోల్ బాటిల్ లీకేజీ కావడంతో గదిలో మంటలు వ్యాపించి ధరణికి అంటుకోగా బయటకు వచ్చింది. ఈ విషయం సహ మహిళా కానిస్టేబుల్ స్వర్ణకు చెప్పింది. అప్రమత్తమైన స్వర్ణ పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తూ కాలిన గాయాలతో ఉన్న ధరణిని పెట్రో కార్‌లో ఎంజీఎంకు తరలించింది. వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ధరణి మృతితో స్వగ్రామం పెంబర్తిలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలి సోదరుడు వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, 2020 బ్యాచ్‌కు చెందిన ధరణి.. పరకాల పోలీస్ స్టేషన్‌లో మొదటి పోస్టింగ్ పొందారు. అనంతరం 2022 సెప్టెంబర్‌లో బదిలీపై నల్లబెల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు.

వరంగల్ మార్కెట్‌లో అంతర్గత బదిలీలు

- ఖరీఫ్‌లో విధుల నిర్వహణ కోసమే మార్పులు
- ఖాళీ పోస్టులతో ఉన్న వారిపై అదనపు భారం


వరంగల్ వ్యవసాయ మార్కెట్ ప్రధాన కార్యాలయం

వరంగల్: ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ప్రధాన కార్యాలయం, లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్, పండ్ల మార్కెట్‌లో విధులు నిర్వర్తించే సూపర్‌వైజర్లు, ఏఎంఎస్, జేఎంఎస్‌లను పెద్ద ఎత్తున అంతర్గత బదిలీలు చేస్తూ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జి.శ్రీకాంత్(సూపర్‌వైజర్)కు అసెస్‌మెంట్ సెక్షన్ (ఎ టు ఎం), పర్చేజ్ రిటర్న్, మార్కెట్ ఫీజుల వసూళ్లు, జేడీఎం, డీడీఎం, డీఎంఓలకు నివేదికలు పంపించే బాధ్యతలు అప్పగించారు. వినయ్‌కాంత్ యూడీసీకి అసెస్‌మెంట్ సెక్షన్(ఎన్ టు జెడ్), పర్చేజ్ రిటర్న్, మార్కెట్ ఫీజుల వసూళ్లు, జేడీఎం, డీడీఎం, డీఎంఓలకు నివేదికలు పంపించే బాధ్యతలు అప్పగించారు. గంగాధర్(సూపర్‌వైజర్)కు కోల్డ్ స్టోరేజీలు, గోదాంల నిర్వహణ, వాచ్ అండ్ వార్డు ఇన్‌చార్జ్ విధులు అప్పగించారు. వి.స్వప్న (సూపర్‌వైజర్)కు కార్యాలయంలోని ఎస్టాబ్లిష్‌మెంట్–1 సెక్షన్‌తో పాటు ధాన్యం, అపరాల యార్డు పూర్తి ఇన్‌చార్జ్ బాధ్యతలతో పాటు ఈ–నామ్ నిర్వహణ, రైతులకు లాట్ ఐడీల జారీ తదితర బాధ్యతలు అప్పగించారు. డి.లక్ష్మీనారాయణ(యూడీసీ)కు ధాన్యం, అపరాల యార్డు నిర్వహణ అప్పగించారు. మురళీయాదవ్(సూపర్‌వైజర్)ను లక్ష్మీపురం మోడల్ వెజ్ మార్కెట్ పూర్తి ఇన్‌చార్జ్‌గా నియమించారు. సలీం(సూపర్‌వైజర్)ను పత్తి యార్డులో పూర్తి ఇన్‌చార్జ్‌గా నియమించారు. చక్రబహదూర్ (సూపర్‌వైజర్)కు గ్రేయిన్ మార్కెట్‌లోని యార్డుల్లో దడవాయిలకు విధుల కేటాయింపు, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, లైటింగ్ పర్యవేక్షణ అప్పగించారు. సాగర్(సూపర్‌వైజర్)కు అదనంగా మిర్చి యార్డు విధులు కేటాయించారు. డి.నర్సింహ(సూపర్‌వైజర్)కు పత్తి యార్డులో పూర్తి విధులు అప్పగించారు. జ్యోతి ప్రకాశ్ (సూపర్‌వైజర్)మార్కెట్ ప్రధాన కార్యాలయానికి వచ్చే లెటర్లు, దరఖాస్తులు ఇన్‌వార్డులో నమోదు చేసి కార్యదర్శికి, కార్యాలయం నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు పంపే లెటర్లు ఔట్ వార్డ్ నిర్వహిస్తారు. నర్సింగరావు(సూపర్‌వైజర్)కు ప్రధాన కార్యాలయంలో డిమాండ్ సెక్షన్, తక్‌పట్టీ సెక్షన్, బజారు సెక్షన్ల పూర్తి బాధ్యతలు అప్పగించారు. శ్రీనునాయక్(సూపర్‌వైజర్)కు లక్ష్మీపురం పండ్ల మార్కెట్‌లో పూర్తి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. జి.వివేక్(జేఎంఎస్) పత్తి యార్డు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఎం.రజిత(జేఎంఎస్) ప్రధాన కార్యాలయంలోని డిమాండ్, తక్‌పట్టీ సెక్షన్‌తో పాటు మిర్చి యార్డులో సహాయకులిగా అదనపు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

సీజన్‌లో ఇబ్బందులు లేకుండా..



రానున్న ఖరీఫ్ సీజన్‌లో వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే రైతులకు సరుకుల కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యార్డుల్లో విధులు నిర్వర్తించేందుకు ఉద్యోగులకు అంతర్గత బదిలీలు నిర్వహించాం. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాగానే అక్కడ విధులు నిర్వర్తించేందుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తాం.

–పి.నిర్మల, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి

ఉద్యోగులపై అదనపు భారం...

వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో అన్ని క్యాడర్లు గ్రేడ్–1, గ్రేడ్–2, యూడీసీ, అకౌంటెంట్, ఎల్‌డీసీ, గ్రేడర్, ఏఎస్‌లు, సూపర్‌వైజర్లు, ఏఎంఎస్, జేఎంఎస్‌లతో కలిపి 109 మంజూరు పోస్టులు ఉన్నాయి. ఇందులో 83 పోస్టులు ఖాళీ ఉండగా కేవలం 26 పోస్టుల్లో మాత్రమే ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ఖాళీలతో ప్రస్తుతం ఉన్న వారికి అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల యార్డుల్లో పర్యవేక్షణ కొరవడే అవకాశాలు ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేస్తే మార్కెట్‌లో పర్యవేక్షణ పెరిగి రైతుల సరుకులకు గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంటుందని రైతు సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.


కాల్వలో పడి వ్యక్తి మృతి

- మృతదేహాన్ని వెలికి తీసి కుటుంబీకులకు అప్పగించిన పోలీసులు


చిరంజీవి (ఫైల్)

రామన్నపేట : ఓ వ్యక్తి కాల్వలో పడి మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ డాక్టర్స్ కాలనీలో చోటు చేసుకుంది. మట్టెవాడ పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ డాక్టర్స్ కాలనీలో నివాసముంటూ ప్రైవేట్ డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్న గజ చిరంజీవి(39) సోమవారం రాత్రి 9 గంటల సమయంలో తన బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో తన ఇంటికి సమీపంలోని క్వాలలో కాలుకు అంటుకున్న బురద కడుక్కునేందుకు అందులోకి దిగాడు. ఈ సమయంలో కాలు జారడంతో కొట్టుకుపోయాడు. సురేశ్ అనే వ్యక్తి దీనిని గమనించి చిరంజీవి కుటుంబ సభ్యులకు తెలిపాడు. కాగా, చిరంజీవి మృతదేహం గీసుగొండ మండలం బాలయ్యపల్లి బ్రిడ్జి వద్ద చిక్కుకోగా పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి మంగళవారం కుటుంబీకులకు అప్పగించారు. ఈ ఘటనపై మృతుడి భార్య వనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు.

కళాక్షేత్రానికి ఉర్దూభాష నేమ్‌ప్లేట్ బిగింపు


సాక్షి స్పందన

న్యూశాయంపేట : హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రానికి రాష్ట్ర రెండో అధికార భాష ఉర్దూ నేమ్‌ప్లేట్‌ను బిగించారు. కాగా, కాళోజీ కళాక్షేత్రం పేరు ఉర్దూలో కూడా లిఖించాలని ఆ భాషాభిమానులు, కళాకారులు, కవులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలకు కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) అధికారులు స్పందించారు. మంగళవారం కళాక్షేత్రం ఎదుట ఉన్న గ్రిల్స్‌కు తాత్కాలికంగా ఉర్దూ భాషలో లిఖించిన నేమ్‌ప్లేట్ బిగించారు. కాగా, పర్మనెంట్‌గా బిల్డింగ్ పై భాగంలో రేడియం అక్షరాలతో ఉర్దూ నేమ్‌ప్లేట్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు మహ్మద్ నయీం డిమాండ్ చేశారు.

వ్యక్తి పై కేసు నమోదు

ఖిలా వరంగల్ : చెల్లెపై దాడికి పాల్పడిన అన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. శంభునిపేట విశ్వనాథ కాలనీలో పాలేపాక అరుణ నివాసం ఉండగా.. ఆమె అన్న మస్తాన్ వరంగల్ లక్ష్మీపురంలో నివాసం ఉంటున్నాడు. తన భార్యను తీసుకురావాలని మస్తాన్ తన చెల్లి అరుణ కోరాడు. దీనికి ఆమె నిరాకరించడంతో ఈనెల 12న దాడికి పాల్పడ్డాడు. అరుణ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

క్లుప్తంగా

రూ.5.75లక్షలకు సంత వేలం

కేసముద్రం: మండలంలోని కేసముద్రంవిలేజ్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి గురువారం నిర్వహించే వారాంతపు సంతకు మంగళవారం వేలంపాట నిర్వహించారు. ఇన్‌చార్జ్ డీపీఓ కన కదుర్గ సమక్షంలో నిర్వహించిన ఈ వేలంపాటలో, ఐదుగురు కాంట్రాక్టర్లు పోటీపడ్డారు. ఈమేరకు వరంగల్ జిల్లా నెక్కొండ మండలానికి చెందిన మధుకర్‌రెడ్డి రూ.5.75లక్షలకు వేలం పాడి, ఈనెల 17నుంచి, 2025 మార్చి 31వరకు (23వారాలపాటు) అంగడి నిర్వహణ హక్కులను దక్కించుకున్నట్లు కార్యదర్శి రాజు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

మహబూబాబాద్ అర్బన్: మహబూబాబాద్ జెడ్పీ సీఈఓ పురుషోత్తం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపడుతున్న నర్మద డిప్యూటీ సీఈఓగా యథావిధిగా విధులు నిర్వహించనున్నారు.

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి



మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాల పెండింగ్ బిల్లులు, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని నలంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ అన్నారు. ప్రైవేట్ డిగ్రీ, పీజీ విద్యాసంస్థల బంద్ ప్రకటించి జిల్లా కేంద్రంలోని మదర్‌థెరిసా సెంటర్‌లో మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బిక్కి వెంకటేశ్వర్లు, కృష్ణప్రసాద్, శంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

డీపీఓకు ఫిర్యాదు

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లో వ్యవసాయ బావులకు వెళ్లే దారిలో తమ సొంత ఖర్చులతో పోసుకున్న మొరం రోడ్డుపై, అక్రమంగా జీపీ నుంచి బిల్లు చేసుకుని రూ.4లక్షలు డ్రా చేసుకున్నారంటూ ఆరోపిస్తూ మంగళవారం కేసముద్రంవిలేజ్ జీపీలో ఇన్‌చార్జ్ డీపీఓ కనకదుర్గకు, పలువురు రైతులు ఫిర్యాదు చేశారు.

పాఠశాలకు చేయూత

నెల్లికుదురు: మండలంలోని ఆలేరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాల అభివృద్ధికి తన వంతు సహాయంగా పూర్వపు విద్యార్థిని కమటం ఐశ్వర్య రూ.10వేలు హెచ్ఎం రాందాస్‌కు అందించారు.

17నుంచి జిల్లాస్థాయి పోటీలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాస్థాయి కళా ఉత్సవ్–2024 పోటీలు జిల్లా కేంద్రంలోని గుమ్ముడూరు ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఈనెల 17న నిర్వహిస్తున్నట్లు డీఈఓ వి.రాజేశ్వర్ మంగళవారం తెలిపారు. పోటీల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ 9,10,11,12 తరగతులు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. మ్యూజిక్, డ్యాన్స్, డ్రామా, ఆర్ట్, వ్యాసరచనపై పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు నిర్వాహకులు ఆజాద్ చంద్రశేఖర్ 98661 08880, అప్పారావు 98495 98281, సుధాకర్ 90529 80678లను సంప్రదించాలన్నారు.

కమిటీల లొల్లి

బయ్యారం: రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ వారీగా నామినేట్ చేయనున్న ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఎంపిక అధికార కాంగ్రెస్ పార్టీలో వర్గపోరుకు తెరలేపింది. మండలంలోని రామచంద్రాపురం పంచాయతీలో ఇందిరమ్మ కమిటీ సభ్యుల నియామకంపై మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ సాక్షిగా అధికార పార్టీకి చెందిన రెండువర్గాలు బాహాబాహీగా దిగాయి. ఎవరికి వారు తమ వర్గాలకు చెందిన పేర్లు ఉండాలని అధికారులపై ఒత్తిడి తేవటంతో పాటు కార్యాలయం ముందు ఇరువర్గాలకు చెందిన వారు పరస్పర ఆరోపణలో వాదనలకు దిగారు. దీంతో అధికారులకు తలనొప్పిగా మారింది.

మో'డల్' అంగన్‌వాడీ కేంద్రం

- క్రీడా పరికరాలు జీపీ పార్కుకు తరలింపు
- టాయిలెట్లు లేక ఇబ్బందులు
- భవనం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు
- అమ్మపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో వసతులు కరువు



అమ్మపాలెం మోడల్ అంగన్‌వాడీ కేంద్రం



వంట గదిలో పగిలిన ఫ్లోర్

డోర్నకల్: మండలంలోని అమ్మపాలెం మోడల్ అంగన్‌వాడీ కేంద్రంలో గతంలో ఏర్పాటు చేసిన వసతులు కనుమరుగయ్యాయి. అమ్మపాలెం ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ భవనంలో అమ్మపాలెం–1, అమ్మపాలెం–2, మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని కలిపి 2017లో మోడల్ అంగన్‌వాడీ కేంద్రంగా ఏర్పాటు చేశారు. అప్పటి కలెక్టర్ ప్రీతీ మీనా ప్రారంభించారు. కేంద్రంలో గోడలపై చిన్నారులను ఆకట్టుకునేలా రంగురంగుల బొమ్మలు వేశారు. కేంద్రం ఎదుట పిల్లలు ఆడుకునేందుకు క్రీడా పరికరాలను ఏర్పాటు చేశారు. లోపల కలర్ టీవీతోపాటు చిన్నారులు కూర్చునేందుకు రంగురంగుల కుర్చీలు ఏర్పాటు చేశారు. పిల్లలతో సందడిగా నడిచిన మోడల్ అంగన్‌వాడీ కేంద్రం తరువాత కష్టాలు మొదలయ్యాయి.

అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలోని క్రీడా పరికరాలను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్కుకు తరలించారు. పలు కారణాలతో విద్యుత్ సరఫరా నిలవడంతో టీవీ మూలన పడింది. గోడలకు వేసిన బొమ్మల రంగు వెలిశాయి. భవనం అడుగున పందికొక్కులు తోడటంతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. భవనం చుట్టూ గడ్డి, పిచ్చి మొక్కలు పెరగడంతో పాములు అంగన్‌వాడీ కేంద్రం పరిసరాల్లో సంచరిస్తున్నాయి. మూడు కేంద్రాలు ఒకేచోట ఉండటం, లాయిలెట్లు లేక ఇబ్బందులు ఎదురవుతుండటంతో కేంద్రం ఆవరణలో రూ.లక్ష రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయనున్న టాయిలెట్ల నిర్మాణ పనులకు 2023 ఆగస్టు 19న అప్పటి ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి సంవత్సరం దాటినా నేటికీ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఇటీవల పంచాయతీ కార్యదర్శి చొరవతో అంగన్‌వాడీ భవనానికి విద్యుత్ సౌకర్యం కల్పించారు. అధికారులు స్పందించి మోడల్ అంగన్‌వాడీ కేంద్రంలో మెరుగైన వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

చీడపీడల నివారణపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

గార్ల: పత్తి, మిర్చి పంటల్లో చీడపీడల నివారణ కోసం తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై మహబూబాబాద్ వ్యవసాయ సహాయ సంచాలకుడు అజ్మీర శ్రీనివాస్ రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం గార్ల మండలం ముత్తితండా, పోచారం గ్రామాల్లోని పత్తి, మిర్చి తోటల్లో ఆయన క్షేత్ర ప్రదర్శన చేశారు. మిర్చితోటల్లో అధిక మోతాదుల్లో సేంద్రియ ఎరువులు వాడొద్దని, దీని వలన తోటలకు చీడపీడల ఉధృతి పెరుగుతుందన్నారు. వ్యవసాయ అధికారులను సంప్రదించి తోటలకు పురుగు మందులను పిచికారీ చేయాలని సూచించారు. ఏడీఏ వెంట ఏఓ కావటి రామారావు, ఏఈఓ పూజిత, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కురవి: మండలంలోని రాజోలు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల హెచ్ఎం రవికుమార్ మంగళవారం తెలిపారు. పాఠశాలకు చెందిన బి.శివ, డి.అంగద్‌లు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. వీరికి రూ.30వేల నగదు బహుమతిని వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ కిషన్, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, దామోదర్, మోహన్, బీకు, సురేష్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి పోరాటాలు



మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రజల పక్షాన సీపీఐ దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తుందని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. పార్టీ పట్టణ కమిటీ సమావేశం మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో అభివృద్ధికి కేటాయించిన రూ.50కోట్ల నిధులు ఎప్పుడొస్తాయి.. అభివృద్ధి ఎప్పుడు జరుగుతుందని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, శ్రావణ్, మహమూద్, రవీందర్, శంకర్, మహేశ్, శ్యాంప్రసాద్, భాగ్యమ్మ పాల్గొన్నారు.

హామీలు వెంటనే అమలు చేయాలి



ధర్నా చేస్తున్న ఎన్డీ నాయకులు

మహబూబాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మండల వెంకన్న, జిల్లా కార్యదర్శి బండారు ఐలయ్య డిమాండ్ చేశారు. ఎన్డీ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించి కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు, కౌలు రైతులకు పంటసాయం కింద ప్రకటించిన రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12వేల హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లింగన్న, వెంకటేశ్వర్లు, సక్రు, సాయిలు, యాకయ్య పాల్గొన్నారు.

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీదే అధికారం



సభ్యత్వాన్ని అందిస్తున్న సీతారాంనాయక్

డోర్నకల్: 2029 అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని మాజీ ఎంపీ సీతారాంనాయక్ తెలిపారు. డోర్నకల్‌లోని మెయిన్ రోడ్డులో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న సీతారాంనాయక్ మాట్లాడుతూ.. కేసీఆర్ దుర్మార్గపు పాలనతో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించారని అన్నారు. ప్రస్తుతం ప్రజలకు కాంగ్రెస్ పార్టీపై భ్రమలు తొలగాయని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణాలో బీజేపీ బలమైన శక్తిగా ఎదుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు దేవానాయక్, మండల అధ్యక్షులు గణేష్‌నాయక్, నాయకులు లక్ష్మినారాయణ, రెహమాన్, బస్సబోయిన ఉపేందర్ పాల్గొన్నారు.

సమ్మేళనం జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కురవి: ప్రజా ఉద్యమాల సారథి గిరిజన సంఘం వ్యవస్థాపకుడు గుగులోత్ ధర్మానాయక్ వర్ధంతి సందర్భంగా నవంబర్ 5, 6 తేదీలలో ఖమ్మంలో జరగనున్న గిరిజన సంఘం సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ డైరెక్టర్ మాలోత్ నెహ్రూనాయక్, సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మాలోత్ కిషన్‌నాయక్ పిలుపునిచ్చారు. మండలంలోని లింగ్యాతండాలో సమ్మేళనం కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బానోత్ దేవానాయక్, కిషన్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మాలోత్ హరిలాల్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, బాలునాయక్ పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలని వినతి

నెహ్రూసెంటర్: ఎన్‌హెచ్‌ఎంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కుమార్, రుక్మొద్దీన్ అన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో కార్యాలయ సూపరింటెండెంట్‌కు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. ప్రతి నెల 1వ తేదీన వేతనాలు వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కరుణాకర్, వసంత, శ్రీనివాస్, సౌమిత్, ఉమాకర్, రాజ్‌కుమార్, అరుణ్, నీలిమా, తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి అబ్దుల్ కలాం కృషి



మహబూబాబాద్: బేతోలు గ్రామంలో కేక్ కట్ చేస్తున్న యూత్ సభ్యులు



గూడూరు: అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు



గార్ల: సీతంపేటలో..



తొర్రూరు రూరల్: చెర్లపాలెం స్కూల్‌లో..



కేసముద్రం: శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌లో..



నెల్లికుదురు: జూనియర్ కళాశాలలో..



బయ్యారం: జూనియర్ కళాశాలలో..



డోర్నకల్: మున్సిపల్ కార్యాలయంలో..

డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక సీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా, విద్యావేత్తగా ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి దేశ అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడిన గొప్ప వ్యక్తి కలాం అని కొనియాడారు. - సాక్షి నెట్‌వర్క్

సంక్షిప్త సమాచారం

విజయవంతం చేయాలి

కేసముద్రం: మచ్చాపూర్‌లో ఈనెల 17న నిర్వహించనున్న ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రమేశ్, సీతారాములు, వెంకన్న, వీరన్న, కరుణాకర్, పుల్లయ్య పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

దంతాలపల్లి: ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియాలో ఐఎఫ్‌టీయూ, కార్మిక సంఘంను విలీనం చేసేందుకు హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి కోరారు. మంగళవారం మండల కేంద్రంలో సభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెగ్గం యాకయ్య, సాయి, ప్రవీణ్, భిక్షం, కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

డోర్నకల్: తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు డోర్నకల్ జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం బండి నర్సింహారావు తెలిపారు. పాఠశాల విద్యార్థుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన స్టూడెంట్ వెల్ఫేర్ ఫండ్‌కు తన జన్మదినాన్ని పురస్కరించుకుని రూ.5వేల నగదు అందించారు. కార్యక్రమంలో అప్పిరెడ్డి, మంజులత, వసంతరాణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరా బంద్

మహబూబాబాద్: మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా చేసే ప్రధాన వాటర్ గ్రిడ్ పాయింట్ వద్ద సంపును శుభ్రం చేస్తున్నందున ఈనెల 16న నీటిసరఫరా బంద్ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

నర్సింహులపేట: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండల సభ్యుల నియామకం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఈఓ వేణుగోపాల్ మంగళవారం తెలిపారు. ఆరుగురు సభ్యుల నియామకం కోసం 20రోజుల వ్యవధిలో ఆసక్తి గల వారు ఆలయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

వైద్యాధికారిగా వినోద్

దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం గ్రామ పశు వైద్యాధికారిగా వినోద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా గ్రామానికి వచ్చారు.

హామీలను అమలు చేయాలి

నెహ్రూసెంటర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. పార్టీ కంకరమిల్ తండా శాఖ మహాసభ మంగళవారం వాంకుడోత్ రమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో సోమయ్య, సీతారాంనాయక్, నాగన్న, వీరూనాయక్ పాల్గొన్నారు.

ధ్వజస్తంభానికి క్షీరాభిషేకం



గార్ల: గార్ల మండలం మర్రిగూడెం వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ సందర్భంగా మంగళవారం నూతన ధ్వజస్తంభానికి జలదివాసం, క్షీరాభిషేకం నిర్వహించారు. దాత ఎన్నారై పులి గోపాల్‌రెడ్డి, ప్రమీలారెడ్డి దంపతులు, లక్ష్మణ్‌నాయక్, వేణుగోపాల్, పరుచూరి కుటుంబరావు దంపతులు పూజలు నిర్వహించారు.

వీరన్న సన్నిధిలో పూజలు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి ఆలయంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంకా బద్రినారాయణ, మిర్యాల సతీష్‌రెడ్డి , తదితరులు ఉన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

దంతాలపల్లి: ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు తప్పక చేసుకోవాలని ఏపీయూఎస్, టీపీయూఎస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దంతాలపల్లి, కుమ్మరికుంట్ల తదితర ఉన్నత పాఠశాలలను సందర్శించారు. కార్యక్రమంలో హెచ్ఎం వేణుమాధవరెడ్డి, మురళీ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలలో సమగ్రశిక్ష అభియాన్ కింద విధులు నిర్వహిస్తున్న ఆర్ట్, క్రాఫ్ట్‌ల పీటీఐలకు 12నెలల జీతాలను వేసి, రెగ్యులరైజ్ చేయాలని పీటీఐల సంఘం జిల్లా నాయకులు జంపాల నారాయణ మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో అంబరీష, ప్రభాకర్, శ్రీనివాస్, మూర్తి పాల్గొన్నారు.

అమ్మపాలెంలో పశువైద్య శిబిరం

డోర్నకల్: మండలంలోని తహసీల్దార్ బంజర గ్రామంలో మంగళవారం పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పశువైద్యాధికారి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సుమారు 230 ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో సిబ్బంది చందర్, సులేమాన్, వెంకన్న, రజిని పాల్గొన్నారు.

ఇందిరమ్మ గ్రామ కమిటీల ఎన్నిక

మహబూబాబాద్ రూరల్: మండలంలోని సోమ్లతండా గ్రామంలో ఇందిరమ్మ గ్రామ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. సభ్యులుగా శివలాల్, శంకర్, సింగ్, పద్మ, సునీత ఎన్నికయ్యారు.

కేసముద్రం: మండలంలోని కాట్రపల్లి గ్రామంలో కాంగ్రెస్ గ్రామ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీని ఎన్నుకున్నట్లు పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులుగా సూరయ్య, మహేష్, నరేష్, సంధ్య, జ్యోతి ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్..

పురుగులమందు తాగి రైతు ఆత్మహత్య

కేసముద్రం: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని మహముద్‌పట్నం గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఏశబోయిన లింగయ్య(53) అనే రైతు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా అతడు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. బాధను తట్టుకోలేక మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగులమందు తాగాడు. ఈ మేరకు లింగయ్యను కుటుంబ సభ్యులు మానుకోటకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు ప్రవీణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

మడగూడెం వాసి మృతి

గంగారం: డెటాయిల్ తాగి మడగూడెం వాసి హైదరాబాద్‌లో మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని మామిడిగూడెం గ్రామానికి చెందిన జనగాం వెంకటేశ్వర్లు–సాలమ్మల కుమారుడు జనగాం మధు(27) హైదరాబాద్‌లో పటాన్ చెరువులో పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మధుకు అనారోగ్య సమస్యలు ఉన్నాయని, సోమవారం మద్యం మత్తులో డెటాయిల్ తాగాడు. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పటాన్ చెరువు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలుడి అదృశ్యం.. కేసు నమోదు



మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని హనుమంతుని గడ్డ ప్రాంతానికి చెందిన భాషా, రజియా దంపతుల కుమారుడు మస్తాన్(15) అదృశ్యమవగా తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ మంగళవారం తెలిపారు. మస్తాన్ బయ్యారం మండలంలోని ఇర్సులాపురం గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడన్నారు. చుట్ట పక్కల వెతికినప్పటికీ సమాచారం రాలేదని, ఇంటికి తిరిగి రాకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు.


దాడి ఘటనలో ఒకరిపై..

గూడూరు: మద్యం మత్తులో దాడి చేసుకున్న ఘటనలో బోడ బాలు అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు పంచాయతీ కార్యదర్శిపై కేసు నమోదు చేసినట్లు సీఐ బాబూరావు మంగళవారం తెలిపారు. మండలంలోని అయోధ్యపురానికి చెందిన పంచాయతీ కార్యదర్శి, తేజావత్ రాంసింగ్‌తండాకు చెందిన బోడ బాలు సోమవారం రాత్రి గ్రామంలోని ఓ బెల్టు షాపులో మద్యం తాగడానికి వెళ్లారు. డబ్బులు ఇచ్చే విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. పంచాయతీ కార్యదర్శి కొట్టినట్లు బోడ బాలు ఫిర్యాదు చేశాడు. బాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

దొంగ అరెస్టు

నెల్లికుదురు: ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. తొర్రూరు మండలం సోమారంకుంట తండా శివారు తుల్యాతండాకు చెందిన బానోతు నవీన్ నెల్లికుదురు మండలంలోని వివిధ గ్రామాలతోపాటు చుట్టు పక్కల మండలాలల్లో పట్టపగలు తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. నవీన్‌కు మంగళవారం పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

18నుంచి కబడ్డీ పోటీలు



గార్ల: గార్ల మండలం మర్రిగూడెం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు, భూక్యా రాజు మెమోరియల్ 32వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గార్ల సమీపంలోని మర్రిగూడెం వెంకటేశ్వరస్వామి మినీ స్టేడియంలో ఈనెల 18నుంచి 20వరకు నాలుగు జిల్లాల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు బంజార యువజన సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ అధికారి భూక్యా కస్నానాయక్ తెలిపారు. మంగళవారం మర్రిగూడెంలో మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలస్థాయి కబడ్డీ క్రీడాపోటీల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కబడ్డీ, డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంట్రీల నమోదుకు 90141 18193, 90109 43242 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరునాయక్, హరినాయక్, మల్లిబాబు పాల్గొన్నారు.